LOCAL NEWS స్థానికం LOCAL NEWS
మహబూబ్‌నగర్
ఆదివారం
03-05-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily




## మెరుగైన సౌకర్యాలతో న్యాయ ప్రక్రియ మరింత వేగం: కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రోజు రోజుకు పెరుగుతున్న కేసుల దృష్ట్యా న్యాయస్థానాల్లో కక్షిదారులకు, న్యాయవాదులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించటం ద్వారా న్యాయ ప్రక్రియ వేగంగా కొనసాగేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కేంద్ర న్యాయస్థానంలో నూతనంగా నిర్మించిన కోర్టు హాలును రాష్ట్ర హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగరావు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు మేడ్చల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.లక్ష్మ ణ్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డిలతో కల్సి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాలకు నో చెప్పండి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ లోని ఆర్మీ డెంటల్ కాలేజీలో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం యాంటీ నార్కోటిక్ బ్యూరో ను ఏర్పాటు చేసిందని, ముఖ్యంగా మేడ్చల్ పరిసరాల్లో సింథటిక్ డ్రగ్స్ కట్టడికి ఈగల్ కోర్స్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ రవాణా చేసే ముఠాలపై, నిబంధనలు ఉల్లంఘించే ఫార్మా కంపెనీలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా వెంటనే 1903 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని బాలల హక్కుల కమిషన్ సభ్యులు సరిత, చందన తెలిపారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, యువ త వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జాయింట్



డైరెక్టర్ మోతి, అదనపు డిసిపి నరసింహారెడ్డి సూచించారు. జవహర్‌నగర్ ప్రాంతాన్ని డ్రగ్స్ రహిత జోన్ గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎక్సైజ్ అధికారి నవీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, విద్యాశాఖ అధికారి హేమలత, ఏఎస్పీ (నార్కోటిక్) రమేష్, డ్రగ్ కంట్రోలర్ ఎడి లక్ష్మీ నారాయణ, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్మీ డెంటల్ కాలేజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసులు ప్రజలు కలిసి కట్టుగా పోరాడాలని అధికారు లు ఈ సభ ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ సత్యనారాయణ, ఆర్మీ డెంటల్ కాలేజ్ విద్యార్థులు, స్థానికులు, యువత పాల్గొన్నారు.



## పదిలో మేడ్చల్ జిల్లా టాపర్ వై.లక్ష్మీనారాయణకు అభినందన

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ బోరంపేట్ గ్రామానికి చెందిన వై.లక్ష్మీ నారాయణ ఇటీవలే పదో తరగతి పరీక్షల్లో మేడ్చల్ జిల్లాలోనే అత్యధిక మార్కులు సంపాదించి బోరంపేట్ గ్రామానికి ప్రభుత్వం పాఠశాలకు ఎంతో గర్వకారణమని దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థిని శాలువాతో సత్కరించారు. విద్యార్థిని అభినందిస్తూ సహాయసహకారాలు అందిస్తామని, బౌరంపేట పాఠశాల విద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. బౌరంపేట్ మాజీ 17వ వార్డు కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సింగాపురం జంగారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు అమ్మగారి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కోశాధికారి కొమ్ము ప్రశాంత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన కౌన్సిలర్‌లకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాఆబద్ మున్సిపల్‌లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్‌లను ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌనె హన్మంతరెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో శామీర్ పేట మండల ప్రైవేట్ పాఠశాలల నుంచిఅలియాబాద్ మున్సిపాలిటి 4 వ వార్డు కౌన్సిలర్ దీపిక వరప్రసాద్‌రెడ్డి (సెయింట్ మేరిస్ హై స్కూల్ ) తుర్కపల్లి, 5 వ వార్డు కౌన్సిలర్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి (సరస్వతి విద్యానికేతన్)లాల్‌గడిమలక్‌పేటకు వారిని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌనె హన్మంతరెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ట్రస్మా అధ్యక్షుడు మాధవరెడ్డి, కోశాధికారి దివ్యజ్యోతి, ట్రస్మా సభ్యులు శివశంకర్, పంచాక్షరి, సూరజ్, వరప్రసాద్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలనేదే లక్ష్యం

### 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు, రాష్ట ప్రజలకు అందాలనే లక్ష్యంతో రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ప్రారంభించింది అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధికి 600 కోట్లతో రోడ్లు వేయించామన్నారు. ప్రతిగ్రామంలో 50లక్షలతో సిసిరోడ్లు వేయించామన్నారు. ఎన్నికల హామీలు కొన్ని కొన్ని పథకాల ను అమలు చేస్తున్నా ఇందులో ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, సన్నబియ్యంవంటి పథకా లు అమలు చేస్తున్నాం అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామాలు, కాలనీలలోని ప్రజలకు తెలియజేయాలని అన్నారు, వికారాబాద్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. మర్పల్లి మండలానికి పబ్లిక్ స్కూల్ మంజూరు అయిందన్నారు.

జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వ అదేశాల మేరకు బోర్‌వెల్స్ మంజూరు చేశామన్నారు. 594 గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం అందిస్తున్న ప్రతి స్కీం ను అమలు చేస్తున్నామన్నారు. మంజూరైన నిధుల్లో అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనాలను పూర్తి చేస్తామన్నారు. జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమదాలు జరగకుండా 'అలైవ్ ఆరైవ్' కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కలిపించామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్‌పిటిసిఇఒ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహరెడ్డి, యంపిడిఒ విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్‌లు శ్రీనివాస్ ముదరాజు,మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నీట్ ఎగ్జామ్స్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్ దీపక్‌తివారి**

3న వికారాబాద్ జిల్లా నాలుగు సెంటర్లులో జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం జిల్లా ఎస్‌పిస్నేహమెహ్రాతో కలిసి కొత్తగడి రెసిడెన్సియల్ స్కూల్ లోని సెంటర్‌ను పరి



శీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్ష కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయలు కల్పించాలని ఆదేశించారు. ఉదయం 11గంటలనుండి మధ్యాహ్నం 1.30 వరకు జరుగనున్న నీట్ పరీక్షకు అభ్యర్థు లు హాజరును బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోవడం జరుగుతుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను సక్రమంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నా పత్రాల తరలింపు కార్యక్రమం అన్ని శాఖల అధికారులు సమవన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజావాణి డివిజన్ అధికారులను నియమాకం :**

ప్రజాసమస్యలను పరిష్కారం కొరకు నిర్వహిం చే ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ అధికారిని నోడల్ అధికారిగా నియమించి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ, స్వీకరించిన దరఖాస్తులను 30రోజు ల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని , లేనిపక్షంలో తిరిస్కరణకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసిరశీదు అందించాలని, దరఖస్తుదారులకు ప్రజావాణి పోర్టల్‌లో తమ దరఖాస్తులను సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన కామారెడ్డి గూడ సర్పంచ్ శంకరమ్మ**

**వికారాబాద్ రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని కామారెడ్డి గూడ గ్రామ సర్పంచు శంకరమ్మ శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా శంకరమ్మకు శుభాకాంక్షలు తెలి



పారు.మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

### సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ రోజు వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మిషన్ వాత్సల్య పథకం, జిల్లా మహిళా శిశు దివ్యాంగుల , వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల పంచాయతీ సభ మరియు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సంక్షేమ అధికారిణి బి.కృష్ణవేణి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లాలో నష ముక్త్ భారత్ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. యువతలో మాదక ద్రవ్యాల నియంత్రణకు వారిచే ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. తల్లిదండ్రులు ముఖ్యంగా చెడు అలవాట్లకు మద్యపానానికి బానిసలు కావొద్దని, పిల్లలు తల్లిదండ్రులను చూసి చెడు అలవాట్లకు, మద్యపానానికి, గంజాయికి అలవాటు పడుతున్నారని, తమ పిల్లలతో స్నేహితుల వలె మెలగాలని సూచించారు.

పిల్లల వ్యక్తిగత గదులు అదే విధంగా వారి యొక్క బ్యాగులను అప్పుడప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. తద్వారా పిల్లల యొక్క అలవాట్లు వారి ఆలోచనలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు తెలుసుకోవచ్చని తెలిపారు. యువత చెడు స్నేహాలను విడనాడాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిస అయిన వారికి ప్రత్యేకమైన కౌన్సిలింగ్, పునరావాస కేంద్రాలు ద్వారా పునరావాసం పొందుతున్నారు. వివిధ కార్యక్రమాలు గ్రామస్థా






యిలో బాల పంచాయతీలు నిర్వహించి పిల్లల సమస్యలను గుర్తించాలని అన్నారు. పిల్లలకు ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వాలని వారిని బాలసభల ద్వారా సంఘటితపరచడంతో బాలల వ్యక్తిగత సమస్యలు చర్చకు వస్తాయి. తరువాత వారి యొక్క హక్కుల అమలుకు కృషి జరుగుతుందన్నారు. చట్టబద్ధమైన దత్తత గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

చట్ట విరుద్ధమైన దత్తత తీసుకోరాదని తెలిపారు. హక్కులకు భంగం కలగకుండా చూస్తామని జిల్లాలో మదనపల్లి డిసిపిఒ శ్రీకాంత్, జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న బాల్యవివాహాల గురించి, అనాధ పిల్లల గురించి, చట్టబద్ధమైన దత్తత గురించి వివరించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిదని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ, యువత మత్తుకు బానిసలు కాకుండా చదువుకోవాలని ఉన్నతమైనటువంటి లక్ష్యాలను కలిగి ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో పిల్లల సంరక్షణ బాధ్యతతో పాటు బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని, పిల్లల సంరక్షణ విషయంలో ముందస్తు సమాచారం ఇస్తామని తెలిపారు. జిల్లా స్థాయి పంచాయతీ ఆఫీసర్ సంధ్యారాణి ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి బాలసభ నిర్వహించాలని అందులో ముఖ్యంగా గ్రామసభలో బాలసభలు గ్రామ సర్పంచ్ లకు, పంచాయతీ సెక్రెటరీలను కోరారు. గ్రామ పంచాయతీ ద్వారా పిల్లల యొక్క సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఇఒ అబ్దుల్ రహమాన్, సిఐ అన్వర్ పాషా, రాఘవేని, భరోసా ఎస్సై శ్వేత, స్రవంతి, ఎంపి విజయ్ కుమార్, బాలల సంరక్షణ అధికారులు ఆంజనేయులు, రాజు నాయక్, యంగిస్తాన్ ఫౌండేషన్, ప్రతినిధులు సిరిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఉపాధ్యాయులు వివిధ గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు, బాల బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రియల్టర్ల కబంధ హస్తాల్లో పోతారం వాగు

### బండరాళ్లు, మట్టిపోసి వాగును ఆక్రమిస్తున్న రియల్టర్‌లకు అధికారుల అండదండలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రభుత్వభూములకు, చెరువులకు, కుంటలకు రక్షణ లేకుండా పోయిందని నీటి పారుకం గల వాగులను రియల్టర్లు, దళారులు ఆక్రమిస్తున్న సంబంధిత అధికారులకు పట్టింపు లేకుండా పోయిందని మూడుచింతలపల్లి మండల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా చిన్నపర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని పోతారం వాగును కొందరు రియల్టర్లు బండరాళ్లు వేసి మట్టిపోసి పూడ్చుతున్న ఘటనలపై పలు దినపత్రికల్లో వార్తా కథనాలు ప్రచురిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు మొద్దు నిద్రలో ఉండి ఆక్రమణలను పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వార మట్టిని తీసుకవచ్చి వాగును పూడ్చుతున్న కూతవేటు దూరంలో ఉన్న రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఆపే ప్రయత్నం చేయలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇట్టి విషయమై ప్రజాపక్షం దినపత్రిక విలేకరి స్థానిక తహాసీల్దార్ దృష్టికి తీసుకవెళ్లి వివరించిన అధికారులకు చెబుతాం మెమోలు జారీ చేస్తాం అని చెప్పడమే కానీ ఇప్పటివరకు ఏలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు మాముళ్ల మత్తులో ఇలాంటి ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ నెల 4న పోతారం వాగు ఆక్రమణకు గురవుతోందని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసిన ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికైన స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పోతారం వాగును సందర్శించి సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు.



## ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మొక్కజొన్నను విక్రయించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్:** మార్క్‌ఫెడ్, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మొక్కజొన్నను విక్రయించాలని దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ మద్దతు ధర 2400 మద్దతు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, మార్క్‌ఫెడ్ డిఎం రేఖ, డిసిఎంఎస్ మేనేజర్, సుదర్శన్‌రెడ్డి, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కో ఆప్షన్ మెంబర్లు కాంగ్రెస్‌కే

**ప్రజాపక్షం/పరిగి :** మున్సిపల్ కార్యాలయం లో జరిగినటువంటి మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికల్లో నాలుగు కో ఆప్షన్ మెంబర్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందన్నారు. ఇందులో మైనార్టీ నుండి అక్బర్ హుసేన్, క్రిస్టయన్ మైనార్టీ నుండి కమల అనంద్, జనరల్ నుండి అంజనేయులు, సీనియర్ సిటిజన్ పిరంగి పద్మ, ఎన్నికై న వారికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శుభాకాంక్ష లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో మీ యొక్క సలహాల్లో కీలకంగా వ్యవహరించాలని తెలియజేశారు. రాబోయే రాజుల్లో పరిగి మున్సిపల్‌ను అన్ని రకాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్మన్ హనుమంతు కమల్ తదితరులు పాల్గొన్నారు.





## అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మల్కాజ్‌గిరి జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వెంకట్‌రెడ్డి అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలియాబాద్‌లో గతంలో కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. అలాగే నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డికి మున్సిపల్ చైర్ పర్సన్ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు కృషి చేయాలని చైర్ పర్సన్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దుండిగల్ డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ ఎస్.వి.మణి కరణ్

**ప్రజాపక్షం/దుండిగల్:** సాధారణ బదిలీలలో భాగంగా దుండిగల్ సర్కిల్ కు డిప్యూటీ కమిషనర్ గా డాక్టర్ ఎస్.వెంకట మణి కరణ్ బాధ్యతలు స్వీకరించరు, కమిషనర్ గా పలు మున్సిపాలిటీ లలో గతంలో పని చేశారు. సిఎంసి కమిషనర్ కు ఓఎస్డి పిఆర్‌ఓ గా పని చేసి ఉన్నారు.



## లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్‌గా అమర్‌నాథ్‌రావు ఎన్నిక

**ప్రజాపక్షం శామీర్‌పేట :** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విస్తరించి ఉన్న 8లయన్స్ జిల్లాలకు చెందిన 320 మల్టిపుల్ కౌన్సిల్ 11వ చైర్మన్‌గా 320 జిల్లా గవర్నర్ లయన్ అమర్‌నాథ్‌రావు ఎన్నికయ్యారు. శనివారం శామీర్‌పేట డివిజన్ అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నికైనట్లు ప్రస్తుత చైర్మన్ టి.రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన మే 2,3వ తేదీల్లో మల్టిపుల్ పదవ మహాసభలు నిర్వహిస్తున్నారు. కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికైన అమర్‌నాథ్‌రావు విద్యారంగం, లయనిజం రెండింటిలోను దూరదృష్టి కల్గిన మహోన్నత వ్యక్తిత్వం గల నాయకుడని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబురావు, సునీల్‌కుమార్, జిల్లా గవర్నర్లు, వైస్ గవర్నర్లు, పూర్వ గవర్నర్లు, మల్టిపుల్ ఆర్‌ఒ కన్న పరుషరాములు, క్యాబినెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి మర్రి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిపికి పీసరి మహిపాల్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్‌ను టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సివి ఆనంద్ డిజిపిగా రావడం సంతోషంగా ఉందన్నారు. పూలబొకేతో శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు సీవి ఆనంద్ ముందుంటరని పేర్కొన్నారు.

## డివిజన్ స్థాయిలో ప్రజావాణి

**ప్రజాపక్షం/తాండూరు:** రెవెన్యూడివిజన్ స్థాయిలో సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిని నియమించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను 30రోజుల్లో పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి రసీదు అందించాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్‌లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చనని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు సమర్పించాడనికి వచ్చే ప్రజలకు తాగునీరు, కుర్చీలు, అత్యవసరమైన వైద్య సేవలను అందుబాటులో ఉండాలని సూచించారు. సోమవారం నుండి నిర్వహించే డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

